www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | బుధ వారం, 31 ఆగస్టు 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-139 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## 3న తెలంగాణ కేబినేట్ భేటీ

అసెంబ్లీ సమావేశాలు తదితర అంశాలపై చర్చ

**హైదరాబాద్, అగస్టు 30 (సమ సమాజం):** సెప్టెంబర్ 3న తెలంగాణ కేబినెట్ సమావేశం జరుగనున్నది. ప్రగతి భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఈ మీటింగ్ జరగనుంది. ఈ సమావేశంలో అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తేదీలు ఖరారు, నిర్వహణపై చర్చించనున్నారు. దీంతో పాటు పలు అంశాలపై కేబినెట్ చర్చించే అవకాశం ఉంది. అనంతరం అదే రోజు టీఆర్ఎస్ లెజిస్లేటివ్ పార్టీ సమావేశం నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. శనివారం సాయంత్రం 5 గంటలకు తెలంగాణ



2వ

## కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు వికటించిన ఘటన

నాలుగుకు చేరిన మృతుల సంఖ్య

మంగళవారం మరొకరు మృతి

బాధితులకు అపోలోలో చికిత్స

ఘటనపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

పోస్ట్ మార్టమ్ నివేదిక ఆధారంగా కారణాలు తెలుస్తాయి

ఇతర ఆరోగ్య సమస్యలతో కూడా చనిపోయి ఉంటారు

వైద్యారోగ్యశాఖ సంచాలకులు శ్రీనివాసరావు

వారం రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని వెల్లడి



2వ

## తెలంగాణ ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

47.74 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వెల్లడి



**హైదరాబాద్, అగస్టు 30 (సమ సమాజం):** తెలంగాణలో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. ఇంటర్ బోర్డు కార్యదర్శి జలీల్ ఫలితాలను విడుదల చేశారు. ఎంసెట్ కౌన్సిలింగ్ ఉన్నందున ఎంసెట్ కౌన్సిలింగ్ ఉన్నందున కేవలం ద్వితీయ ఇంటర్ ఫలితాలు మాత్రమే విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఆగస్టు 1 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షకు దాదాపు 1.13లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్

2వ

## తెరాస, బిజెపిలవి కుమ్మక్కు రాజకీయాలు



చీకటి ఒప్పందంలో భాగంగా పరస్పర విమర్శలు

ఉపఎన్నిక వేళ ఓట్లకోసం కొత్తగా విద్యుత్ బకాయిల లొల్లి

లిక్కర్ కుంభకోణంలో కవిత ఇంటిపై ఎందుకు దాడి చేయరు

మోడీతో కుమ్మక్కయి విమర్శలు చేస్తున్న గులాం నబీ ఆజాద్

మీడియా సమావేశంలోమండిపడ్డ రేవంత్, ఉత్తమ్

2వ

## రూపాయి ఖర్చు లేదు..చెమటోడ్చే పనిలేదు

ఫ్రీగా డబుల్ ఇళ్లు కట్టించి ఇస్తున్నాం

పేదలకు డబుల్ ఇళ్లపై మంత్రి హరీష్ వ్యాఖ్యలు



**సిద్దిపేట, అగస్టు 30 (సమ సమాజం):** రూపాయి ఖర్చు లేకుండా..మీ చెమట చుక్క పడకుండా.. డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించి పేదలకు అందిస్తున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. జిల్లా లోని గజ్వేల్ మండలం బెజగామ గ్రామంలో రైతు వేదిక, డబుల్ బెడ్ రూమ్ గృహ ప్రవేశాల కార్యక్రమాలకు హాజరైన హరీష్ రావు లబ్దిదారులతో గృహప్రవేశాలు చేయించారు.

2వ

# 50 అడుగుల భారీ ఖైరతాబాద్ గణేశుడు

మట్టితో పాటు సంప్రదాయ రంగులతో నిర్మాణం● నేడు పూజలతో అంకురార్పణ



**హైదరాబాద్, అగస్టు 30 (సమ సమాజం):** వినాయకచవితి అనగానే ఖైరతాబాద్ గణెలిషుడే గుర్తుకు వస్తాడు. ఈసారి కూడా ఖైరతాబాద్ వినాయకుడు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాడు. భారీ గణపతిని మట్టితో చేశారు. మొత్తంగా రెండేళ్ల తరవాత పూర్తిస్థాయిలో చవితి వేడుకలకు ఖైరతాబాద్ గణనాధుడు సిద్ధమయ్యాడు. గణెలిష్ విగ్రహం తయారీ పూర్తి అయింది. ఈ ఏడాది శ్రీ పంచముఖి లక్ష్మి మహా గణపతి రూపంలో భక్తులకి దర్శనం ఇవ్వనున్నాడు. 60 ఏళ్లలో మొదటి సారిగా ఖైరతాబాద్ గణనాధుడిని మట్టితో తయారు చేశారు. జూన్ 10 నుంచి గణెలిష్ విగ్రహం తయారీ పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడు 50 అడుగుల ఎత్తులో గణెలిషుడు దర్శనం ఇస్తున్నాడు. ఖైరతాబాద్ గణెలిషుడికి కుడివైపున శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి, ఎడమ వైపున శ్రీ త్రిశక్తి మహాగాయత్రీ దేవి కొలువుతీరారు. గణెలిష్ నిమజ్జనం హుస్సేన్ సాగర్‌లోనే జరగనుంది. ఖైరతాబాద్ గణెలిష్ తయారీకి కోటి 50 లక్షల రూపాయల వ్యయం అయినట్లు సమాచారం. ఏటా హైదరాబాద్‌లో ఎటు చూసినా వినాయకచవితి సందడే కనిపించేది. వినాయకచవితి అంటేనే బోలెడంత జోష్ ఉండేది. చిన్నా, పెద్దా అనే తేడా లేదు. గల్లీ గల్లీలోనూ ఎక్కడ చూసినా గణపయ్య పేరే వినిపించేది. కానీ కరోనా కారణంగా గత రెండేళ్లుగా సందడి లేకుండా పోయింది. దీంతో ఈ యేడు బొజ్జ గణపయ్య పూజలకు ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లో వినాయకచవితి పండగ ప్రత్యేకతే వేరు. విగ్రహం ప్రతిష్టాపన దగ్గర నుంచీ నిమజ్జనం వరకూ అంతా భక్తి భావంతో ఉప్పొంగిపోతారు. ఘనంగా జరుపుకునేందుకు ఆరాటపడతారు. తమకు తోచిన విధంగా విగ్రాహాలు ప్రతిష్టించేందుకు ఆసక్తి చూపిస్తారు. రెండు, మూడు వారాల క్రితం నుంచే వినాయకచవితి ఉత్సవాల కోసం ఏర్పాట్లు మొదల య్యాయి. ఈసారి కూడా గణెలిష్ పండుగ కోసం ఉత్సాహంగా ఏర్పాట్లు చేసుకున్నారు. ముఖ్యంగా ఖైరతాబాద్ గణెలిష్ ప్రత్యేకాకర్శణ. ప్రతి ఏడాది విశేష అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చే ఖైరతాబాద్ గణపతి ఈసారి మరింత శోభాయమానంగా తయారయ్యాడు. వినాయకుడిని పూజిస్తే లోకకల్యాణం జరుగుతుందని, ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని నమ్మకం.

# మునుగోడులో కారు జోరు




## చేరికలతో ఊపందుకున్న టీఆర్ఎస్ పార్టీ


ఉపఎన్నిక బరిలో టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ఫైనల్ ?

- కూసుకుంట్లకు జనాదరణ మెండు
- రాజగోపాల్‌రెడ్డిపై వ్యతిరేకతతో చేరికలు

**హైదరాబాద్,ఆగస్ట్ 20 (సమ సమాజం):** మునుగోడు ఉపఎన్నిక రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే ఎన్నికగా భావించి తేరాసా అధినేత కేసీఆర్ అభ్యర్థి ఎన్నికలో ఆచీ తూచి వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో పలువురు నేతల పేర్లను పరిశీలించిన అధిష్టానం తుది పరిశీలనలో ఉంచింది. ఇదిలా ఉంటే క్షేత్ర స్థాయిలో బలమైన నాయకత్వం కలిగిన కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని బరిలో దింపేందుకు కసరత్తు చేస్తున్నట్లుగా తెలుస్తుంది. ఉద్యమ కాలం నుంచి కేసీఆర్‌కు నమ్మిన బంటులా వ్యవహరిస్తూ, కేసీఆర్ అదేశాలను తూచా తప్పకుండా మునుగోడు నియోజకవర్గం లో పార్టీ బాధ్యతలు చక్కబెడుతున్నారు. కూసుకుంట్ల నిబద్ధతను గుర్తించిన హైకమాండ్ రెండు పర్యాయాలు మునుగోడు నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా నిలబెట్టింది. అయితే ఉపఎన్నిక అనివార్యం కావడంతో మరోమారు కూసుకుంట్లను బరిలో దింపాలని చూస్తున్నారు. అయితే ఉపఎన్నిక బరిలో కూసుకుంట్లను పోటీలో నిలిపితే పార్టీలోని అసంతృప్తి వాదుల నుంచి ముప్పువాటిల్లే ప్రమాదం ఏమైనా ఉంటుందా అనే కోణంలో గులాబీ బాస్ పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ప్రకటించిన తరువాత టీఆర్ఎస్ అభ్యర్థిని ప్రకటించేందుకు వ్యూహాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే రాజగోపాల్‌రెడ్డి బురిడీ మాటలను విశ్వసించని కార్యకర్తలు రాబోయే రోజుల్లో రాజగోపాల్ రెడ్డిపై వ్యతిరేకతతో మరిన్ని చేరికలు జరిగే అవకాశం ఉంది.

"తెలంగాణ ఉద్యమ కార్యసాధ్వికుడు కేసీఆర్ సారధ్యంలో విధేయుడిగా పనిచేస్తున్న కూసుకుంట్ల.. నాడు ఉద్యమకారుడిగా, నేడు మునుగోడు నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జ్‌గా ప్రజాహితం కోసం మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల అహర్నిషలు కృషి చేస్తున్నారు. జననేత కూసుకుంట్ల ఆధ్వర్యంలో బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు తండోపతండాలుగా టీఆర్ఎస్‌లో చేరుతున్నారు.

పలు పార్టీల కార్యకర్తలకు తాయిలాల ఆశ చూపి బీజేపీలోకి చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కార్యకర్తలు చుక్కలు చూపిస్తున్నారు. అభివృద్ధికి దిక్సూచిగా టీఆర్ఎస్ ఉందని, మత సామరస్యానికి అసలైన ప్రజాస్వామిక పార్టీ టీఆర్ఎస్ పార్టీ అని మునుగోడు ప్రజలు విశ్వసిస్తున్నారు. అందుకే కాంగ్రెస్, బీజేపీ పార్టీల కార్యకర్తలు టీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.





కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలను టీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించి కండువ కప్పుతున్న కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

## సంపాదకీయం

# పర్యావరణ హితంగా వినాయక పూజ !

భారతీయ సాంప్రదాయాలు, పండగలు అన్నీకూడా ప్రకృతితో ముడిపడి ఉన్నవే. ప్రకృతిని ఆరాధించడం మనజీవితంలో నిత్యకృత్యం. అయితే ప్రకృతిని ఆరాధిస్తున్న మనం..దాని విధ్వంసాన్ని పట్టించుకోవడం లేదు. ప్రకృతి పరిరక్షణ చర్యలను పెద్దగా గుర్తించడం లేదు. దీనినుంచి బయటపడే మార్గాలను ఆలోచిం చాలి. విఘ్నాలను నివారించే వినాయకుని పూజతో మనం పండగను జరుపుకొంటాం. గణపతి అంటే ప్రకృతి ప్రియుడు. ఆయనకు మనం చేసే పూజ అంతా ప్రకృతి ఆరాధన కిందకే వస్తుంది. మన పండగలన్నీ ప్రకృతి ఆరాధనతో మమేకమై వుంటాయి. వినాయకచవితి పర్వదినంలో మనం అనేక పుష్పాలు, ఫలాలతో స్వామిని పూజిస్తాం. విఘ్నాలను నివారించే వినాయకుని పూజతో మనం పండగను జరుపుకొంటాం. చెరువుల్లో మట్టిని తవ్వి తీసుకుని వచ్చి వినాయకుడిగా చేసి, మళ్లీ చెరువలోనే పూజించిన పత్రీపూలతో నిమజ్జనం చేయడం వెనక శాస్త్రీయత ఉంది. మట్టిని తీసి మళ్లీ అది ఎరువుగా, చెరువు నీరు కాలుష్యరహితంగా కావడానికి జరిగే ప్రక్రియ ఇందులో ఇమిడి ఉంది. మంనం పూజించే మారేడు, ఉత్తరేణి వంటివి ఔషధ గుణాలు కలిగి ఉండడం వల్ల వీటిని కాలుష్యం నుంచి కాపాడుతాయి. అందుకే వినాయకచవితి ఎన్నో ప్రత్యేకతలు కలిగిన పర్వదినంగా చూడాలి. ఏటా కొన్ని వేల గణపతి విగ్రహాలను రంగులతో అలంకరించి మండపాల్లో ఏర్పాటుచేయడాన్ని చూస్తుంటాం. అలాగే ప్రతి ఇంట్లో వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి పూజ నిర్వహిస్తాం. ఇవన్నీ ప్రకృతికి దగ్గరగా ఉండేలా చూడాలి. అలాగే ప్రకృతి పరిరక్షణ ద్వారా పండగల పరమార్థం తెలుసుకోవాలి. గణపతి నవరాత్రుల కోసం ఖర్చు చేసే మొత్తాన్ని ప్రకృతి పరిరక్షణకు ఉపయో గిస్తే కరోనా లాంటి వైరస్‌లు మనలను ఏమీ చేయలేవు. మన పండగలన్నీ ప్రకృతి ఆరాధనతో మమేకమై వుంటాయి. వినాయకచవితి పర్వదినంలో మనం అనేక పుష్పాలు, ఫలాలతో స్వామిని పూజిస్తాం. వినాయక పూజలో ఉపయోగించే పత్రిలో విశేష ఔషధ గుణాలు ఉన్నాయి. గోరంత పత్రి పెడితే చాలు కొండంత వరాలు గుప్పిస్తాడు. అందుకే వినాయక పూజ అంటే అందరికీ ఇష్టం. వారిని ప్రోత్సహించడం ద్వారా ప్రకృతికి పాటుపడేలా చేయాలి. ఉండ్రాళ్ళ నైవేద్యానికే మహదానందపడిపోతాడు విఘ్నేశ్వరుడు. ఒక్క వినాయకుడికే పత్రిపూజ ఎందుకు చేస్తాం? ఎందుకంటే ఆయన గజముఖుడు కదా! ఏనుగుకు ఇష్టమైనవి ఆకులే కదా! అందుకే ఈ పత్రి పూజ. ఏకవింశతి... అంటే ఇరవైఒక్క రకాల పత్రితో గణెళిశుణ్ణి పూజిస్తాం. గజాననుడని కీర్తించినా, మూషిక వాహనుడని మొక్కినా, సర్వవిఘ్నాలకు అధినాయకుడని శిరస్సు వంచినా తొలిపూజలు దక్కేదతనికే. అందుకే భాద్రపద శుక్ల చవితి రోజున భక్తి శ్రద్ధలతో వినాయక పూజ చేసుకోవడం పుణ్యప్రదం.. మోక్ష దాయకం! నేత్ర, మూత్ర, చర్మ సంబంధమైన రోగాలతోపాటు మరికొన్ని ఇతర వ్యాధులకు మంచి మందుగా పనిచేస్తుందీ పత్రి. అంతేకాక ఆ పత్రి నుంచి వెలువడే సుగంధాన్ని పీల్చడం వల్ల కూడా స్వస్థత చేకూరుతుంది. పత్రిని మనం చేత్తో ముట్టుకోవడం వల్ల అందులో ఉండే వృక్ష సంబంధ రసాయన పదార్థాలు కావలసిన మోతాదులో చర్మం ద్వారా మన శరీరం లోకి శోషణం చెంది ఆరోగ్యాన్ని చేకూరుస్తాయి. తొమ్మిది రోజుల తర్వాత వినాయకుణ్ణి బావుల్లో, నదుల్లో, చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. ఇలా ఎందుకు చేయడం అంటే కలుషితమైన ఆ నీటిని శుభ్రం చేయడానికి ఈ 21 పత్రాలు ఉపయోగపడతాయట. అందుకే తొమ్మిది రోజుల పూజ తర్వాత విగ్రహంతో పాటు ఆకులను కూడా నీళ్లలో వదిలేసి వస్తారు. ఇవి ఇరవైమూడు గంటలయ్యాక తమలో ఉన్న ఔషధగుణాల ఆల్కలాయిడ్స్‌ని నీళ్లలోకి వదిలేస్తాయి. దాని వల్ల నీటిలో ఉండే బాక్టీరియా నిర్మూలన జరిగి నీళ్లల్లో ఆక్సిజన శాతం పెరుగుతుంది. వినాయక పూజ వల్ల మనకు విఘ్నాలు తొలగి అనుకున్న పనులన్నీ చక్కగా జరుగుతాయి. పిల్లలకు పత్రి సేకరణ వల్ల వృక్ష విజ్ఞానంతో పాటు వినోదం, పర్యావరణం పట్ల స్నేహభావం కలుగుతాయి. చెరువుల్లో మట్టిని తవ్వి తీసుకుని వచ్చి వినాయకుడిగా చేసి, మళ్లీ చెరువలోనే పూజించిన పత్రీపూలతో నిమజ్జనం చేయడం వెనక శాస్త్రీయత ఉంది. మట్టిని తీసి మళ్లీ అది ఎరువుగా, చెరువు నీరు కాలుష్యరహితంగా కావడానికి జరిగే ప్రక్రియ ఇందులో ఇమిడి ఉంది. అందుకే వినాయకచవితి ఎన్నో ప్రత్యేకతలు కలిగిన పర్వదినంగా చూడాలి. ఏటా కొన్ని వేల గణపతి విగ్రహాలను రంగులతో అలంకరించి మండపాల్లో ఏర్పాటు చేయడాన్ని చూస్తుంటాం. అలాగే ప్రతిఇంట్లో వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి పూజ నిర్వహిస్తాం. వీటిని మట్టితో తయారుచేస్తేనే మన పర్యావరణం కాపాడకున్నవారం అవుతాం. ఇటీవల కొంతకాలంగా విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ప్యారిస్, రసాయనాలు కలిగిన రంగులను ఎక్కువగా వినియోగిస్తున్నారు. వినాయక నిమజ్జనంతో ఈ రంగులు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చెరువులు, కుంటలు, తటాకాలు, బావులు, నదులకు పర్యావరణ నష్టం జరుగుతోంది. ఈ జలాల్లో నివసించే అనేక జీవకోటి మనుగడకు విఘాతం ఏర్పడుతోంది. అలాగే నీరు కలుషితం అవుతోంది. దీంతో మళ్లీ ఇది వాడడానికి వీలు లేకుండా హైదారాబాద్ హుస్సేన్ సాగర్‌లా కాలుష్య కాసారంగా మారుతున్నాయి. అందుకే ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను వాడాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. మట్టి గణపతులను తయారుచేయడం ద్వారా కొంతయినా పర్యావరణం కాపాడుకోగలం. ఇంట్లో పూజించే చిన్న చిన్న వినాయక విగ్రహాలను పూర్తిగా మట్టితో తయారుచేస్తే అవి పర్యావరణహితంగా వుంటాయి. నీటిలో సులభంగా కరిగిపోతాయి. ఎలాంటి రంగులను వాడకపోవడంతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉండదు. ఇక వీధుల్లో ప్రతిష్టించే పెద్ద విగ్రహాల తయారీలోనూ మట్టినీ, పర్యావరణ హితమైన రంగుల్నీ వాడటం ద్వారా పర్యావరణానికి మేలు చేయొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఇటువంటి విగ్రహాల వల్ల నిమజ్జన సమయంలో జలాలు కలుషితం కావని చెబుతున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఈ వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా స్వచ్ఛమైన ప్రకృతి కోసం కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. వినాయక మండపాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలి. శబ్ద కాలుష్యం కలిగించకుండా చూడాలి. పెద్ద పెద్ద చెరువులూ, తటాకాలూ, కుంటల్లో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేసి పర్యావరణానాన్ని దెబ్బతీయకుండా చేస్తే అంతకు మించిన పర్యావరణపరిరక్షణ మరోటి ఉండదు.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# తెరాస, బిజెపిలవి కుమ్మక్కు రాజకీయాలు




(మొదటి పేజి తరువాయి) హైదరాబాద్, అగస్టు 30 (సమ సమాజం): తెరాస, భాజపా ప్రభుత్వాలపై రాష్ట్ర కాంగ్రెస్ నేతలు, ఎంపీలు రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మోదీ, కేసీఆర్ చీకటి ఒప్పందంలో భాగంగానే ఆయా పార్టీల నేతలు ఒకరిపైనొకరు విమర్శలు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఉపఎన్నిక వేళ ఓట్ల కోసం కొత్తగా విద్యుత్ బకాయిల లొల్లిని తెరపైకి తెచ్చారని కాంగ్రెస్ నేతలు విమర్శించారు.కవితపై సీబీఐ, ఈడీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న కాంగ్రెస్ నేతలు తెరాస, భాజపా ప్రభుత్వాల వైఫల్యాలపై ప్రజల్లో చర్చ జరగకుండా ఉండేందుకే ఆ పార్టీల నేతలు ఒకరిపైనొకరు విమర్శలు చేసుకుంటున్నారని రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మోటార్లకు మీటర్ల బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు తెరాస ఎంపీలు సభకే హాజరుకాలేదని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు చెల్లించిన డబ్బును పార్టీ విస్తరణ కోసం ఇతర రాష్ట్రాల్లో కేసీఆర్ ఖర్చు చేస్తున్నారన్నారు. సెప్టెంబర్ 1 నుంచి మునుగోడులో క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తామని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కవిత మీద బీజేపీ ఎంపీలు లిక్కర్ స్కాం ఆరోపణలు చేస్తున్నారు. సీబీఐ, ఈడీ మరి ఆమె ఇంటికి ఎందుకు వెళ్లడం లేదు. అంతటా దాడులు చేస్తున్న సిబిఐ కవిత ఇంటిపై ఎందుకు చేయడం లేదన్నారు. భాజపా బ్లాక్ మెయిల్ చేసి ప్రొటెక్షన్ మనీ సంపాదిస్తోంది. రాహుల్ పాద యాత్ర చేస్తున్నారు.. మోదీ మోకాళ్ల యాత్ర చేస్తారా బంగాల్ మోడల్ ఇక్కడ అమలు చేస్తున్నారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ పేరుతో తెరాస, భాజపా డ్రామాలు చేస్తున్నాయని మండిపడ్డారు. బండి పాద యాత్ర వల్ల ప్రజలకు వచ్చే ఉపయోగం లేదు. ఆయనకు మోకాళ్ల చిప్పలు అరుగుతాయి. ఉపఎన్నికల ముంగిట విద్యుత్ బకాయిల పేరిట తీట పంచాయితీ తెచ్చారు. ఆగస్టు 8న మోటార్లకు మీటర్ల బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. చీకటి ఒప్పందం కారణంగా తెరాస ఎంపీలెవరూ పార్లమెంటుకు రాలేదు. ఉభయకుశలోపరి మాదిరిగా భాజపా-తెరాస ఒకరినొకరు తిట్టుకుంటున్నారని రేవంత్ అన్నారు. 'గులాం నబీ ఆజాద్‌కు 50ఏళ్ల అనుభవం ఉంది. కాంగ్రెస్ నుంచి అత్యధిక బెనిఫిట్ పొందిన వ్యక్తి ఆజాద్. రాజ్యసభ పొడిగించలేదని ఆజాద్ ఇలా మాట్లాడుతున్నారు. గాంధీ కుటుంబంపై ఆయన చేస్తున్న వ్యాఖలను ఖండిస్తున్నట్లు వెల్లడించారు. కేవలం మోడీతో కుమ్మక్కు అయిన ఆజాద్ ఇలా కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజగోపాలరెడ్డి రాజీనామాతో మునుగోడుకు పైసా ఉపయోగం జరగలేదని, కానీ ఛోటామోటా నేతల కొనుగోళ్లతో డబ్బులు చేతులు మారుతున్నాయని ఈ విషయంలో టీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒకటే అని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీ నాయకులను ఇష్టం వచ్చినట్లు కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు. నల్గొండకు బీజేపీ తీవ్ర అన్యాయం చేసిందన్నారు. సాగునీటి విషయంలో పాలమూరును కేంద్ర రాష్ట్రాలు మోసం చేశాయని విమర్శించారు. మునుగోడులో సమస్యలపై చర్చకు రాకుండా డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని..కలెక్టరేట్ల ప్రారంభోత్సవంలో ప్రోటోకాల్ పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి పేరుతో భూములు కొల్లగొట్టేందుకు రాష్ట్ర సర్కారు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. మాజీ పిసిసి చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితరులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అనేకమంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే సీఎం కేసీఆర్ పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి అన్నారు. ఇక్కడి రైతుల సమస్యలను పట్టించుకోని సీఎం..ఇతర రాష్ట్రాల రైతులకు పరిహారం ఇస్తారని చెప్పారు. రాష్ట్రం అనేక సమస్యలతో సతమతమవుతుందన్నారు. ఈ సమస్యలు పట్టించుకోని కేసీఆర్..బిహార్‌లో కార్మికులకు సాయం చేస్తారా అని ప్రశ్నించారు. ఇక్కడే దిక్కులేదు..దేశమంతా తెలంగాణ మోడల్ ను అమలు చేస్తారా..ఎద్దేశా చేశారు. మన కార్మికులు, రైతులు, జవాన్లను పట్టించు కోకుండా..కేసీఆర్ గొప్పలకు పోతున్నారని మండిపడ్డారు. తెలంగాణ మోడల్ అంటే టెండర్లు ఇచ్చుడు.. కమీషన్లు గుంజుడేనా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇదిలావుంటే మునుగోడు అభ్యర్థి విషయంలో పీసీసీ ప్రతిపాదనలు ఏఐసీసీకి పంపామని కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. అభ్యర్థిని ఏఐసీసీ ఫైనల్ చేస్తుందని చెప్పారు. అందరు కలిసి కట్టుగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. గులాం నబీ ఆజాద్ కి 50ఏళ్ళ అనుభవం ఉందని..కాంగ్రెస్ నుండి అత్యధిక బెనిఫిట్ పొందిన వ్యక్తి ఆజాద్ అని చెప్పారు. రాజ్యసభ సభ్యత్వాన్ని పొడిగించలేదని ఆజాద్ అసంతృప్తితోనే మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. గాంధీ కుటుంబంపై చేస్తున్న వ్యాఖలను ఖండిస్తున్నామన్నారు. మతకల్లోలాలను రెచ్చగొట్టడానికే రాజాసింగ్ మాటలు మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బిజెపి రాజాసింగ్‌ను ఆయుధంగా వాడుతుందని ఆరోపించారు. రాజాసింగ్ శాసనసభ సభ్యత్వాన్ని స్పీకర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి ఆయన్ని శిక్షించాలన్నారు. అటు కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ, ఈడీ ఎంక్వయిరీ వేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. 8 ఏళ్లుగా కేంద్రంలో ఉన్న బిజెపి ఏం చేస్తుందని ప్రశ్నించారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర సర్కార్ లు విఫలమయ్యాయని దుయ్యబట్టారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర సర్కార్లు విఫలమయ్యాయి. కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ, ట్రైబల్ యూనివర్సిటీపై కూడా పార్లమెంట్‌లో అడిగితే మాటేలేదని ఉత్తమ్ అన్నారు.

# 3న తెలంగాణ కేబినేట్ భేటీ



(మొదటి పేజి తరువాయి) భవన్‌లో భేటీ జరుగనున్నది. టీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ అధ్యక్షతన సాగే ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీలు సైతం పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, నూతనంగా అమలు చేస్తున్న పెన్షన్లు, గిరిజనులకు పోడు భూములు తదితర అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. ఈ మంత్రివర్గ సమావేశం అనంతర తెలంగాణ భవన్ లో సాయంత్రం 5 గంటలకు టీఆర్ఎస్ లెజిస్లేటివ్ పార్టీ సమావేశాన్ని నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. పార్టీ అధినేత సీఎం కేసీఆర్ అధ్యక్షతన సాగే ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీలు కూడా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా, రాష్ట్రంలో అమలవుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, నూతనంగా అమలు చేస్తున్న పెన్షన్లు, గిరిజనులకు పోడు భూములు, తదితర అంశాలపై నేతలు చర్చించనున్నట్టు సమాచారం.

## తెలంగాణ ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

(మొదటి పేజి తరువాయి) సప్లిమెంటరీ ఫలితాలు కోసం వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు నమోదు చేశారు. ఇంటర్ రెండో సంవత్సరం సప్లిమెంటరీలో 48,816 మంది ఉత్తీర్ణత సాధించారు. 47.74 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 5 నుంచి 8వరకు రీకౌంటింగ్‌కు అవకాశం బోర్డు కల్పించింది. ఇవాళ సాయంత్రం ఇంటర్ మొదటి సంవత్సరం సప్లమెంటరీ ఫలితాలు విడుదల చేయనున్నట్లు బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ తెలిపారు.మరోవైపు ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పులు చేశారు. ఇంటర్ సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన వారి కోసం గడువు పొడిగించారు. ఇవాల్టితో ముగియనున్న ధ్రువపత్రాల పరిశీలన స్లాట్ బుకింగ్ గడువును సెప్టెంబర్ 2 వరకు పొడిగించారు. వెబ్ ఆప్షన్ల గడువు సెప్టెంబరు 3 వరకు పొడిగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# నేడు బీహార్ పర్యటనకు సిఎం కెసిఆర్

గల్వాన్ లోయ అమర జవాన్ల కుటుంబాలకు ఆర్థిక సాయం

బీహార్ కార్మిక కుటుంబాలకు సైతం సాయం పంపిణీ

జాతీయరాజకీయాలపై నితీశ్‌తో కెసిఆర్ చర్చలు



హైదరాబాద్, అగస్టు 30 (సమ సమాజం): ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం బీహార్ పర్యటనకు వెళ్లనున్నారు. ఆ రాష్ట్ర సీఎం నితీష్ కుమార్‌తో జాతీయ రాజకీయాలపై చర్చలు జరపనున్నారు. హైదరాబాద్ నుంచి పాట్నాకు ప్రత్యేక విమానంలో బయలుదేరుతారు. ముందుగా నితీష్‌తో కలిసి గతంలో ప్రకటించిన మేరకు గల్వాన్ లోయలో అమరులైన ఐదుగురు భారత సైనికుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నారు. అలాగే ఇటీవల సికింద్రాబాద్ టింబర్ డిపోలో జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 12 మంది బీహార్ కార్మికుల కుటుంబాలకు కూడా రూ. 5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతల మధ్య జాతీయ రాజకీయాలపై చర్చ జరుగనుంది. జాతీయ రాజకీయాల్లో బీజేపీయేతర పార్టీల మధ్య ఐక్యత, సమన్వయం విషయంలో ఎలా ముందుకెళ్లాలన్న దానిపై చర్చించనున్నారు. వాస్తవానికి గల్వాన్ లోయలో ఘర్షణలో అమరులైన సైనికుల కుటుంబాలకు పరిహారం అందిస్తామని సీఎం కేసీఆర్ గతంలోనే ప్రకటించారు. ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో బీజేపీకి వ్యతిరేకంగా వెళు తున్నందున కలిసొచ్చే పార్టీలతో పనిచేసేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. మరోవైపు ఈనెల 31న బిహార్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన పూర్తిగా రాజకీయం కోసమే అని పరిశీలకులు అంటున్నారు. గాల్వాన్ లోయల్లో మరణించిన సైనికుల కుటుంబాలకు, సికింద్రాబాద్ టింబర్ డిపోలో మరణించిన వలస కార్మికుల కుటుంబాలకు ఆర్థికసాయం అందించే కారణంతో ఆయన పర్యటన సాగనుంది. కేసీఆర్ బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి పాట్నా బయలుదేరి వెళ్తారు. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌తో కలిసి సీఎం కేసీఆర్ చెక్కులు పంపిణీ చేస్తారు.

## వినాయక చవితి చందాల రూపంలో డబ్బుల పంపిణీ

అధికార పార్టీ నిర్వాకంపై సర్వత్రా చర్చ



నల్లగొండ, అగస్టు 30 (సమ సమాజం): మునుగోడు ఉపఎన్నిక ఎప్పుడన్నది ఇంకా స్పష్టత రాలేదు కానీ ఓటర్లను ఆకట్టుకునేందుకు అధికార టీఆర్ఎస్ మాత్రం విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఈ ఉపఎన్నికను చాలా సీరియస్ గా తీసుకున్న గులాబీ పార్టీ ఓటర్లకు తాయిలాలు ఇవ్వడం మొదలుపెట్టింది. నిన్నటి దాకా గోడ గడియారాలు, గొడుగులను పంచిన ఆ పార్టీ లీడర్లు.. ఇప్పుడు వినాయక చవితి పండగను క్యాష్ చేసుకుంటున్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలోని అన్ని యూత్ సంఘాలకు రూ. 10 వేల నుండి 20 వేల వరకు చందాలు ఇస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. పార్టీని, పార్టీ గుర్తును విస్తృతంగా ఓటర్లకు చేర్చాలని టీఆర్ఎస్ లీడర్లు ప్రయత్నాలు చేస్తున్నారు.

# రూపాయి ఖర్చు లేదు..చెమటోడ్చే పనిలేదు

(మొదటి పేజి తరువాయి) ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బెజగామ గ్రామంలో 20 మంది పేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ దసరాకు ఇంటి జాగలో ఇళ్లు కట్టుకునే వారికి రూ.3 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇండ్లు కట్టుకునేందుకు కేవలం రూ.60 వేల రూపాయలు ఇచ్చేదని, అవి బేస్మెంట్ కూడా సరిపోయేవి కావన్నారు.పైగా మధ్య దళారులకు ఇచ్చే కమిషన్ పోగా లబ్దిదారులకు నామ మాత్రంగా డబ్బులు చేతికొచ్చేవని గత ప్రభుత్వ హయాంలో జరిగిన తీరును మంత్రి ఎండగట్టారు. గజ్వేల్‌లో రైల్వే రేక్ పాయింట్ ఏర్పాటు చేసి జిల్లా రైతుల ఎరువుల తిప్పలు సీఎం కేసీఆర్ తప్పించారని గుర్తు చేశారు.కాగా, బెజగామలో 11 కేవీ విద్యుత్ లైను నూతనంగా కావాలని మంత్రిని గ్రామస్తులు కోరారు. వెంటనే స్పందించిన మంత్రి విద్యుత్ లైన్ మంజూరు చేసి మరమ్మతులు ప్రారంభించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. బెజగామ రవి చెరువు వద్ద బతుకమ్మ ఘాట్ వద్ద మెట్లు నిర్మించాలని కోరగా వెంటనే నిర్మిస్తామని గ్రామస్తులకు మంత్రి హామీనిచ్చారు.



# కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు వికటించిన ఘటన



(మొదటి పేజి తరువాయి) రంగారెడ్డి,అగస్టు30(ఆర్ఎన్ఎ): కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు వికటించిన ఘటనలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రిలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల్లో దారుణం జరిగింది. నాలుగు నిండు ప్రాణాలు గాల్లో కలిశాయి. ఒకే ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకున్న వీరు అస్వస్థతకు గురై మృతి చెందారు. మంగళవారం తెల్లవారుజామున మరో మహిళ లావణ్య మృతి చెందింది. దీంతో ఇప్పటి వరకు నలుగురు మహిళలు మృతి చెందారు. ఈ ఘటనలో మమత(25), షుష్మ(26) మృతిచెందగా.. అర్ధరాత్రి మాడుగుల మండలం కొలుకులపల్లి అనుబంధ గ్రామం రాజీవ్‌నగర్ తండాకు చెందిన మేరావత్ మౌనిక(25), మంగళవారం తెల్లవారుజామున ఇబ్రహీంపట్నం మండలం సీతారాంపేట్ గ్రామానికి చెందిన అవుతపురం లావణ్య(25) మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. ఇప్పటికే జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో ఏడుగురు చికిత్స పొందుతున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స అందిస్తున్నారు. అటు ఇవాళ ఉదయం చనిపోయిన లావణ్య కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. సర్కార్ తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే పోస్ట్‌మార్టమ్ నివేదిక వచ్చిన తరవాతనే మరణాలకు కారణాలు తెలుస్తాయని వైద్యారోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు. ఆపరేషన్ల కారణంగానే మరణించారని చెప్పలేమని అంటూ వ్యవహారాన్ని తక్కువ చేసే ప్రకటన చేశారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రిలో ఈ నెల 25న 34 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. ఇందులో ఆపరేషన్లు ఫెయిలై పలువురి పరిస్థితి విషమంగా మారడంతో నిన్న ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటనపై స్పందించిన ప్రభుత్వం ఇద్దరు మృతుల కుటుంబాలకు 5 లక్షల చొప్పులన పరిహారం అందజేసింది. మిగిలిన 30 మందిని కూడా అపోలో హాస్పిటల్‌తోపాటు వివిధ హాస్పిటల్స్ కు తరలించి అధికారులు మెరుగైన వైద్యం అందించే ప్రయత్నం చేస్తున్నారు. ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేసుకున్న మహిళల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు మెడికల్ టెస్టులు చేపట్టారు. ఈ నెల 25న ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రిలో 34 మంది మహిళలకు వైద్యులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేశారు. ఇందులో కొంతమంది మహిళలు తీవ్రమైన గ్యాస్ట్రోఎ÷-రంటరైటిస్‌తో అస్వస్థతకు గురయ్యారు. వారు చికిత్స పొందుతున్న వారిలో మొన్న ఇద్దరు, నిన్న ఒకరు, ఇవాళ మరొకరు మృతి చెందారు. వరుస మరణాలతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న మహిళలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఇబ్రహీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఫెయిలైన ఘటనపై తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు వివరణ ఇచ్చారు. 34 మంది మహిళలకు అనుభవం ఉన్న నిపుణులైన డాక్టర్లతోనే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించామని చెప్పారు. దురదుష్టశావత్తు నలుగురు మహిళలు చనిపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇలాంటి ఘటనలు ఎప్పుడూ జరగలేదన్నారు. ఈ ఘటనను రాష్ట్ర ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకుని దర్యాప్తు చేయిస్తోందని చెప్పారు. నలుగురు మహిళలు చనిపోవడానికి అసలు కారణాలేంటో తెలుసుకునేందుకు అన్ని కోణాల్లో ప్రస్తుతం దర్యాప్తు వేగంగా కొనసాగుతోందన్నారు. వారం రోజుల్లో దర్యాప్తు నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తామని చెప్పారు. ముఖ్యంగా చనిపోయిన వారి పోస్టుమార్టం రిపోర్టులు కూడా దర్యాప్తులో చాలా కీలకమన్నారు. ప్రస్తుతం 30 మంది మహిళల ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని వెల్లడించారు. ఎవరికీ ఎలాంటి ప్రాణపాయం లేదన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్స్ రెగ్యూలర్ గా జరిగే ప్రక్రియని, దేశవ్యాప్తంగా ఇలాంటి ఆపరేషన్స్ జరుగుతుంటాయని చెప్పారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా, డబుల్ బెడ్ రూమ్ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. అంతేకాకుండా చనిపోయిన మహిళల పిల్లల చదువులకు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఆపరేషన్లు ఫెయిలైన ఘటనపై మూడ్రోజుల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో సర్వత్రా విమర్శలు వచ్చాయి. ఘటనపై తెలంగాణ సర్కార్ విచారణకు ఆదేశించింది. డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే చనిపోయారంటున్న బాధిత బంధువులు ఆందోళనలకు దిగారు. వైద్యులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు రూ.50లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# కాశ్మీర్ కాంగ్రెస్‌లో కలకలం

### ఆజాద్‌కు మద్దతుగా నేతల రాజీనామాలు



**జమ్మూ, అగస్టు 30 (సమ సమాజం):** ఇటీవల గులాం నబీ ఆజాద్ కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఆ కశ్మీరీ నేతకు ఇప్పుడు స్థానికులు మద్దతు పలుకున్నారు. ఆజాద్ బాటలోనే ఆ ప్రాంత కాంగ్రెస్ నేతలు పార్టీకి రాజీనామా చేస్తున్నారు. ఆజాద్‌కు మద్దతుగా మాజీ డిప్యూటీ సీఎం తారా చంద్ పార్టీకి రాజీనామా చేశారు. సోనియా గాంధీతో పాటు అనేక మంది నేతలకు సంయుక్త రాజీనామా లేఖను సమర్పించారు. కశ్మీర్‌కు చెందిన మాజీ మంత్రులు అబ్దుల్ మజిద్ వాని, మనోహర్ లాల్ శర్మ, ఘారు రామ్, ఎమ్మెల్యే బల్వాన్ సింగ్ ఉన్నారు. కాంగ్రెస్‌కు ఆజాద్ రాజీనామా చేసిన తర్వాత ఆ రాష్ట్రానికి చెందిన ఆ పార్టీ నేతలు సామూహికంగా రాజీనామా చేస్తున్నారు. కొత్త పార్టీ పెట్టబోతున్న ఆజాద్ చేసిన ప్రకటన కూడా స్థానిక నేతల్ని ఆకట్టుకున్నది. కార్పొరేటర్లు, జిల్లా, బ్లాక్ లెవల్ నేతలు ఇప్పటికే కాంగ్రెస్‌ను వీడి ఆజాద్‌తో చేతులు కలిపారు. రాహుల్ గాంధీ వల్లే కాంగ్రెస్ పార్టీ నాశనమైనట్లు ఆజాద్ ఆరోపించిన విషయం తెలిసిందే.

## రెండు రోజుల్లో తేలిక పాటి వర్షాలు

### హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్, అగస్టు 30 (సమ సమాజం):** రాష్ట్రంలో రాగల రెండు రోజుల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, బుధవారం పలు జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఇదిలా ఉండగా.. మంగళవారంఉదయం వరకు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిశాయి. నిర్మల్, నిజామాబాద్, హనుమకొండ, వరంగల్, రంగారెడ్డి, జగిత్యాలలో మోస్తరు వర్షం కురిసింది. పలు జిల్లాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలో 231 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది.

# సంక్షేమపాఠశాలల్లో సేవలు మెరగు

### ప్రాథమిక పాఠశాల ప్రారంభోత్సవంలో సబిత



**హైదరాబాద్, అగస్టు 30 (సమ సమాజం):** గతంతో పోలిస్తే ఇప్పుడు సంక్షేమ పాఠశాలల్లో సేవలు మెరుగ్గా ఉన్నాయని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ 90 లక్షల సొంత నిధులతో నిర్మించిన ప్రభుత్వ మండల ప్రాథమిక పాఠశాలను సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో మాధవరం రాంచందర్ రావు మెమోరియల్ ప్రారంభించిన మంత్రి ... తెలంగాణా రాష్ట్రం సాధించిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి కొరకు కేసీఅర్ ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ క్రమంలోనే గతంతో ఉన్న సోషల్ వెల్ఫేర్ పాఠశాలలతో పోల్చితే, విద్యార్థులకు విద్య, సన్న బియ్యం భోజన పథకాన్ని కేసీఆర్ కల్పిస్తున్నారని చెప్పారు. గురుకులాల ఏర్పాటుతో ప్రైవేటు పాఠశాల్లోని విద్యార్థులు గురుకులాల్లో అడ్మిషన్ కొరకు ప్రయత్నిస్తున్నారని మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. కేజీ టు పీజీ హామీ ఏదైతే ఉందో, ఆ హామీ నెరవేర్చడం కోసం గురుకులాల్లో ప్రాథమిక, ఉన్నత విద్య, జూనియర్ డిగ్రీ బోధిస్తున్నారన్నారు. బాగా క్వాలి÷ ఉన్న ఉపాధ్యాయులే ప్రభుత్వ పాఠశాలలో ఉంటారన్న మంత్రి,... వారు విద్యార్థులకు మంచి విద్యను అందించాలని ఆదేశించారు. ఇక ఈ కార్యక్రమంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కలెక్టర్ హరీష్ కూడా పాల్గొన్నారు.

# ప్రశాంతంగా గణెళిశ్ ఉత్సవాల నిర్వహణ

**9న గణెళిశ్ నిమజ్జనం ఉంటుంది**

**అధికారులతో సమీక్షించిన మంత్రి తలసాని**

**ఖైరతాబాద్ వినాయకుడి కోసం బారులు తీరిన జనం**



**హైదరాబాద్, అగస్టు 30 (సమ సమాజం):** గణెళిష్ ఉత్సవాలపై బుద్ధ భవన్‌లో జీహెచ్‌ఎంసీ అధికారులతో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సమావేశం అయ్యారు. ప్రశాంతంగా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గణెళిష్ ఉత్సవాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుంద న్నారు. గణెళిష్ ఉత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష జరిపినట్లు చెప్పారు. మట్టి విగ్రహాలను ప్రతిష్టించి పర్యావరణాన్ని పరిరక్షించాలని అవగాహన కల్పిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో 6 లక్షల మట్టి విగ్రహాల పంపిణీ జరుగుతోందన్నారు. ప్రశాంత వాతావరణంలో గణెళిష్ ఉత్సవాలు జరుపు కోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ఉత్సవాల నిర్వహకులు కూడా అధికారులకు సహకరించాలని మంత్రి తలసాని సూచించారు. 9న గణెళిశ్ నిమజ్జనం జరుగుతుందని అన్నారు. ఇదిలావుంటే ప్రఖ్యాతి గాంచిన ఖైరతాబాద్ మహాగణపతి వినాయక చవితి వేడుకలకు సిద్ధమయ్యాడు. ఖైరతాబాద్ బడా గణెళిషున్ని చూసేందుకు భక్తులు బార్లు తీరుతున్నారు. ఖైరతాబాద్ గణెళిషుడు మొదటి సారి మట్టితో తయ్యారయ్యాడు. 150 కళాకారులు జూన్ 10 నుంచి పగలు రాత్రి పని చేస్తూ మహాగణపతిని సిద్ధం చేశారు. ఈ ఏడాది మహాగణపయ్య 50 అడుగుల ఎత్తులో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ ఏడాది శ్రీ పంచముఖ మహాలక్ష్మి గణపతి రూపంలో భక్తులకు కనువిందు చేయనున్నాడు. ఖైరతాబాద్ గణెళిషుడికి కుడివైపున శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి, ఎడమ వైపున శ్రీ త్రిశక్తి మహాగాయత్రీ దేవి కొలువు దీరుతున్నారు. ప్రభుత్వ సూచనలతో ఖైరతాబాద్‌లో మొట్ట మొదటి సారి మట్టి విగ్రహాన్ని తయారు చేశారు. హుస్సేన్ సాగర్ లోనే ఖైరతాబాద్ గణెళిష్ నిమజ్జనం జరుగనుంది. ఖైరతాబాద్ గణెళిష్ తయారీకి కోటి 50 లక్షల రూపాయల వ్యయం అయ్యింది.

# ఎక్స్‌పైరీ అయిన బ్రెడ్‌ను అంటగట్టిన డీ మార్ట్

### కొత్తగా లేబుల్ వేసి మరీ అమ్మిన స్టోర్




**హైదరాబాద్, అగస్టు 30 (సమ సమాజం):** తక్కువ ధరల పేరుతో ప్రజలను ఆకట్టుకుంటున్న డీ మార్ట్ స్టోర్ నాణ్యత లేని వస్తువులను అంటగడుతున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. ఎక్స్‌పైరీ అయిన వాటిని కూడా కట్టబడెతున్నారు. అయితే ఎప్పుడూ కస్టమర్లను ఆఫర్స్ ఆకట్టుకుంటూనే ఉంటుంది. అంత డిమాండ్ ఉన్న స్టోర్ లో తాజాగా చోటు చేసుకున్న ఓ ఘటన అందర్నీ ఆందోళనకు గురి చేస్తోంది. ఓ కస్టమర్ బ్రెడ్ ప్యాకెట్ ను కొనుగోలు చేయగా.. అనంతరం అది ఎక్స్ పైరీ డేట్ అయిపోయిందని తెలిసి షాకయ్యాడు. మలక్‌పేట డీ మార్ట్ స్టోర్ లో జరిగిన ఈ ఘటనలో మామూలుగా ఆ బ్రెడ్ ప్యాకెట్ పై కంపెనీ ప్రింట్ చేసిన చివరి తేదీ ఉంది. కానీ ఆ డేట్ అయిపోవడంతో... మళ్లీ అదే కంపెనీ పేరుతో ఆ ప్యాకెట్ పై పాత తేదీ స్థానంలో మరో కొత్త డేట్ ను ప్రింట్ చేసి ఉన్న స్టిక్కర్ ను అంటించి వినియోగదారులను మోసం చేసే ప్రయత్నం చేశారు. కానీ ఓ కస్టమర్ మాత్రం దాన్ని కని పెట్టేశాడు. ఈ విషయంపై యాజమాన్యాన్ని నిలదీయగా దానితో వారికి ఎలాంటి సంబంధం లేదని సమాధానమిచ్చారు. అంతే కాకుండా అక్కడ ఉన్న మిగతా బ్రెడ్ ప్యాకెట్లనూ ఆ వ్యక్తి తీసివేయించారు. ఇలా కాలం చెల్లిన వస్తువులను ఒకటి కొంటే మరొకటి ఫ్రీ అనే ఆఫర్స్ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆ కస్టమర్ ఆరోపించారు. ఇలా ఇక్కడ ఇంకెన్ని వస్తువులున్నాయో అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

# మావోయిస్టుల మరో ఘాతుకం

### ఇన్‌ఫార్మర్ నెపంతో ఉపసర్పంచ్ హత్య

**భద్రాద్రి కొత్తగూడెం, అగస్టు 30 (సమ సమాజం):** మావోయిస్టులుమరోమారు ఘాతుకానికి పాల్పడ్డారు. వారి ఘాతుకానికి మరో అమాయకుడు బలయ్యాడు. చెర్ల మండలం కుర్నపల్లి గ్రామపంచాయతీ ఉప సర్పంచ్‌ను పోలీసు ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు నరికి చంపారు. నలుగురు మావోయిస్టులు సోమవారం అర్ధరాత్రి ఉప సర్పంచ్ ఇర్ప రామారావు నివాసానికి చేరుకొని అతని వెంట తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు ప్రాధేయపడినా వినకుండా.. అతన్ని వెంట తీసుకువెళ్లారు. మంగళవారం తెల్లవారు జామున రక్తపు మడుగులో గ్రామ శివారులో శవమై కనిపించాడు. ఘటనా స్థలంలో సీపీఐ (మావోయిస్ట్) చెర్ల-శబరి ఏరియా కమిటీ పేరిట లేఖను వదిలి వెళ్లారు. పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తున్నాడని, అందుకే శిక్ష విధించినట్లు లేఖలో పేర్కొన్నారు. పోలీసులు ఇచ్చే డబ్బు కోసం అత్యాశతో ఇన్‌ఫార్మర్లుగా పని చేయొద్దని లేఖలో హెచ్చరించింది.

# తప్పుడు ప్రచారాల్లో ఘనుడు హరీష్ రావు

### తెలంగాణకు ముందూ తరవాత ఆదాయ లెక్కలు చెప్పాలి

### ఎమ్మెల్యే రఘునందన్ రావు డిమాండ్



**సిద్దిపేట, అగస్టు 30 (సమ సమాజం):** మంత్రి హరీష్ తనపై, బీజేపీ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నా రని ఆర్థికమంత్రి హరీష్ రావుపై ఎమ్మెల్యే రఘునందన్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... మంత్రి హరీష్ తనపై, బీజేపీ ప్రభుత్వం ప్రచారం చేస్తూన్నారని అన్నారు. రాష్ట్రం ఏర్పాటు అయినప్పుడు ఆదాయం ఎంత.. ఖర్చు ఎంత.. ఇప్పుడు ఎంత మంత్రి చెప్పగలరా? అని ప్రశ్నించారు. అబద్ధపు ప్రచారంలో హరీష్ రావు స్థాయిని దిగజార్చుకుంటున్నారని అన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో 57 వేల మందికి పెన్షన్లు ఇస్తున్నామన్నది అబద్ధమన్నారు. నియోజకవర్గంలో మొత్తం ఇండ్లే 50వేలు .. మరి 57వేలు పెన్షన్ ఎలా ఇస్తున్నారని ఎమ్మెల్యే నిలదీశారు. ఎమ్మెల్యే రిబ్బన్ కత్తిరించేందుకు తిరుగుతుండు అనడం బాధాకరమన్నారు. ప్రోటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే కాకుండా ఎవరు కత్తిరిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. మొన్ననే దుబ్బాక ప్రజలు కర్ర కాల్చి వాత పెట్టింది గుర్తు లేదా అని వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్ గెలవకుంటే దుబ్బాక అభివృద్ధి ఆపడమా? ఇది సంస్కృతి కాదని అన్నారు. మూడు సంవత్సరాల నుంచి కేసీఆర్ స్కూల్ అట్లే ఉంటుందని.. దమ్ముంటే సీఎంతో ప్రారంభించాలని అన్నారు. దమ్ముంటే తెలంగాణ లో మూడోసారి గెలిచి చూపించాలని సవాల్ విసిరారు. ప్రజలు కట్టిన పన్నుతోనే సంక్షేమ పథకాలు.. దానికి గొప్పలు చెప్పడం ఎందుకు అని రఘునందర్ రావు వ్యాఖ్యలు చేశారు.

# రైతు సంక్షేమంలో తెలంగాణ నంబర్ వన్

### పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి నిరంజన్ రెడ్డి




**వనపర్తి, అగస్టు 30 (సమ సమాజం):** ప్రతి చేతికి పని.. ప్రతి చేనుకు నీరు అన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. తెలంగానలో ఇదే నినాదంతో రైతాంగాన్ని ఆదుకుంటు న్నామని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్,పెట్టబడి సాయంతో పాటు బీమ సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆసరా పింఛన్ లబ్దిదారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేసి మాట్లాడారు. పైరవీలకు తావులేకుండా ఆసరా ఫించన్లు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోనే వేస్తున్నామన్నారు. పెన్షన్లుకోసం ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వొద్దన్నారు. ఈ విడతలో కూడా పింఛన్లు రాని వారు ఆందోళన చెందవద్దు. తిరిగి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పెన్షన్స్ మంజూరు చేయిస్తా మన్నారు. అందరికి మేలు జరగాలన్నదే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అన్నారు. తెలంగాణలో దాదాపు 50 లక్షల ఫించన్లు అందజేస్తున్నామన్నారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశంలో మరెక్కడా లేవన్నారు. తెలంగాణ తరహా పథకాలు అమలు చేయలేక ఈర్ష్యతో రాష్ట్ర ప్రభుత్వం కాళ్లలో కట్టెలు పెడుతున్నారు. కేంద్రంజీఎస్టీ పేరుతో రాష్ట్రాల సొమ్ములు వెనకేసుకుని తిరిగి ఇచ్చేందుకు ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ రమేష్ గౌడ్, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

# గణెళిశ్ ఉత్సవాలతోనే ప్లాస్టిక్ నిషేధం

### ఉత్సవాలతోనే ఇది ప్రారంభం కావాలి ◆ ప్రజలకు పర్యావరణవేత్తల పిలుపు





**హైదరాబాద్, అగస్టు 30 (సమ సమాజం):** వినాయక చవితి ఉత్సవాలను పర్యావరణ హితంగా జరుపుకోవాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. భూసారాన్ని దెబ్బతీస్తున్న పాలిథిన్ వినియోగాన్ని తగ్గించాలని కోరుతున్నా అధికారులు క్షేత్రస్థాయిలో వాటి వినియోగాన్ని నియంత్రించలేక పోతున్నారు. ఇందుకు ఉద్యమ తరహా మార్పు అవసరమని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్లాస్టిక్ రహితంగా ఉత్సవాలను జరుపుకోవాలన్న ప్రతిన తీసుకుంటే మన భూమిని మనం కాపాడుకుంటామని అంటున్నారు. స్వచ్ఛభారత్ అమలు చేస్తున్నా గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగంపై నిసేధం అమలు కాకపోవడంతో తీవ్ర కాలుష్యం ఏర్పడుతోంది. అయితే కరోనా ఎఫెక్ట్‌తో ప్రపంచం మొత్తంగా పర్యావరణహితంగా ప్లాస్టిక్ వాడకమూ తగ్గింది. ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను జార విడుస్తున్న కారణంగా భూమిలో అవి కరగక కాలుష్యం ఏర్పడుతోంది. భూమిలో అది చేరి వాతావరణ కాలుష్యాన్నిపెంచుతోంది. కేన్సర్ వ్యాధి వ్యాప్తికి, వాతావరణం కాలుష్యానికి కారణమౌతున్న ప్లాస్టిక్‌పై ప్రభుత్వం నిషేధం విధించింది. గ్రామాల పరిధిలో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకూ పెరిగిపోతోంది. దీనికితోడు చెత్త శుద్ధి లోపించడంతో ప్రధాన రహదారుల్లో దుర్వాసన వెదజల్లుతోంది. పెళ్లిళ్లు, పండుగలు, పార్టీల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ గ్లాసులు, కవర్ల ను వినియోగిస్తున్నారు. వినియోగం అనంతరం రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో గుట్టలుగా పడేసి చేతులు దులుపుకుంటున్నారు. వాతావరణాన్ని కలుషితం చేసి మన ప్రాణాలను హరిస్తున్నాయన్న విషయం గుర్తించ లేకపోతున్నాం. గుట్టలు గుట్టలుగా పడిఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంగా భావించి తింటున్న పశువులు, జంతువులు మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, సీసాలను తరచూ వినియోగిస్తూ కేన్సర్ వ్యాధి సోకే లక్షణాలు అధికంగా ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చిన్న పిల్లలకు కూడా సోకే అవకాశం అధిక శాతం ఉందని సూచిస్తున్నారు. వినియోగం విపరీతంగా పెరిగి పోవడంతో కాలువలు, డ్రెయిన్లు, ఖాళీ ప్రదేశాలు, డంపింగ్‌యార్డుల్లో గుట్టలు గుట్టలుగా ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోతున్నాయి. డిస్పొజల్ వస్తువుల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. దీంతో పలువురు వ్యాపార స్తులు టన్నుల కొద్ది నిల్వ చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. పలువురు వ్యాపారులు షాపుల ముందు, ఆరుబయట గుట్టలుగా పేర్చి విక్రయాలు నిర్వహిస్తున్నారు. ఆఖరకు కాఫీ హోటళ్లలో కూడా ప్లేట్లలో అరటి, ఇతర ఆకులకు బదులుగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు. ఆహార పదార్థాలు ప్యాకింగ్‌కు సైతం వీటిని వాడుతున్నారు. పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై జిల్లా కలెక్టర్ తహశీల్దార్లకు పూర్తి అధికారాలు ఇచ్చారు. అమ్మినా, కొనుగోలు చేసినా, వినియోగించినా, ఎక్కడబడితే అక్కడ వేసినా రూ.ఐదు వేల నుంచి రూ.25 వేల వరకూ జరిమానా విధిస్తారు. విక్రయ షాపులపై దాడులు చేసి వస్తువులను స్వాధీనం చేసుకోవడం, షాపులను సీజ్ చేయడం వారిపై కేసులు నమోదు చేసే అధికారం తహశీల్దార్లకు ఉంది. ముడుపులకు లొంగి చూసీ చూడనట్లు వ్యవహరించడం పరిపాటిగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మార్కెట్‌లో పేపర్ గ్లాసులు, పేపర్ కవర్లు, ప్లేట్లు దర్శనమిస్తున్నా వివాహాది శుభకార్యాల్లో కూడా ఎ÷–లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉంటుంది. దీనిపై మరలా అధికారులు విస్తృత ప్రచారం చేయాలని ప్రజలు కోరుతున్నారు.ప్లాస్టిక్ నిషేధ ఆజ్ఞలు అమల్లో ఉన్నా అమలు కావడం లేదు. అధికారుల ఉదాశీనత, వినియోగదారుల అవగాహనలేమితో విచ్చలవిడిగా వినియోగం కొనసాగుతూనే ఉంది. దీంతో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఎక్కడ చూసినా కాలువలు, డ్రెయిన్లు వీటితో నిండిపోతున్నాయి. హరిత ఉద్యమం లాగే ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమంగా సాగితే తప్ప నిషేధం అమలు జరగదని అంటున్నారు.




# చలన చిత్రం



## తగ్గేదేలే అంటోన్న అనసూయ

### నెటిజన్ల ట్రోల్స్‌పై ఫిర్యాదు

బుల్లితెర యాంకర్ అనసూయ భరద్వాజ్ పరిచయం అక్కరలేని పేరు. ఓవైపు టీవీ షోలలో అదర గొడుతూనే.. మరోవైపు అవకాశం వచ్చిన్నప్పుడల్లా సినిమాల్లోనూ సత్తా చాటుతోంది. సోషల్ మీడియాలో చాలాయాక్టీవ్ గా ఉండే అనసూయ.. పలు అంశాలపై స్పందించే విధానం తరచూ వివాదాస్పదంగా మారుతోంది.గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో అనసూయను 'ఆంటీ' అంటూ టార్గెట్ చేస్తూ కొందరు నెటిజన్లు ఆమెపై అభ్యంతరకరమైన రీతిలో కామెంట్స్ చేస్తూ రచ్చ చేసారు. దీనిపై ఘాటుగా స్పందించిన అనసూయ ..మరోసారి ఆంటీ అంటే తప్పకుండా వారిపై చర్యలు తీసుకుంటానని పలుమార్లు హెచ్చరికలు చేశారు. అయినా ఏమాత్రం వెనక్కు తగ్గని నెటిజన్లు సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తూ వచ్చారు. 'ఆంటీ' అనే హ్యాష్ ట్యాగ్‌తో వేలకొద్దీ ట్వీట్లు చేసి నేషనల్ వైడ్ ట్రెండ్ అయ్యేలా చేశారు. దీంతో సహనం కోల్పోయిన అనసూయ.. అన్నంత పని చేసింది. తనను ఏజ్ షేమింగ్ చేస్తున్నారంటూ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా వెల్లడించిన అనసూయ..నన్ను ట్రోల్ చేసిన వారిపై చర్యలు తీసుకునే ప్రాసెస్ మొదలైంది. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేసు పెట్టొద్దనుకొని ఇప్పటి వరకు వేచి చూశా..కానీ చేయక తప్పలేదు. సపోర్ట్ చేసిన సైబర్ క్రైమ్ అధికారు లకు థ్యాంక్స్ అని పేర్కొంది. బాడీ షేమింగ్ చేయడాన్ని స్టాప్ చేయండి అంటూ హ్యాష్ ట్యాగ్స్ జోడించింది. ప్రస్తుతం ఈ ట్వీట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'లైగర్' సినిమాకు నెగెటివ్ టాక్ రావడాన్ని ఉద్దేశించి.. పరోక్షంగా అనసూయ ట్వీట్ చేశారని నెటిజన్లు అభిప్రాయ పడ్డారు. 'అర్జున్ రెడ్డి' టైమ్ లో 'ఏం మాట్లాడుతున్నావ్ రామా' అనే విజయ్ దేవరకొండ వ్యాఖ్యలకు కౌంటర్‌గా.. 'లైగర్' సినిమా రిజల్ట్ పై అనసూయ కామెంట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో 'ఆంటీ' అంటూ మీమ్స్ - ట్వీట్స్‌తో ట్రోలింగ్ చేశారు. దీనిపై అనసూయ కూడాతగ్గేదే లే అంటూ రిప్లై ఇస్తూ వచ్చింది. అయినా ట్రోలింగ్ ఆగకపోవడంతో ఇప్పుడు వారిపై సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.



## కమర్షియల్ యాడ్స్‌లోనూ రాణిస్తున్న స్టార్లు

## పలు యాడ్స్‌తో మహేశ్‌బాబు టై అప్

టాలీవుడ్ స్టార్ హీరోలు తమ క్రేజ్‌ని బట్టి కార్పొరేట్ బ్రాండ్‌లకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తూ కమర్షియల్ యాడ్స్‌లో నటిస్తూ రెండుచేతులా సంపాదిస్తున్నారు. ఇంతకు ముందు ఈ ట్రెండ్ బాలీవుడ్ లో మాత్రమే ఎక్కువగా కనిపించేది. కానీ ఈ మధ్య కాలంలో ఇది దక్షిణాది స్టార్స్‌కి పాకింది. బాలీవుడ్ స్టార్స్‌కు మన వాళ్లు ఏమాత్రం తీసిపోని స్థాయిలో క్రేజ్‌ని సొంతం చేసుకోవడంతో చాలా వరకు కంపనీలు మన స్టార్స్‌తో కూడా అంబాసిడర్లుగా కాంట్రాక్ట్లు కుదుర్చుకుంటున్నాయి. కమర్షియల్ బ్రాండ్‌ల విషయంలో టాలీవుడ్‌లో వున్న స్టార్ హీరోల్లో సూపర్ స్టార్ మహేష్ బాబు ముందు వరుసలో నిలుస్తున్నారు. డెన్వర్, మౌంటేయిన్ డ్యూ, బైజూస్ ,ఇంటెక్స్ గోల్డ్ విన్నర్, పాన్ బహార్, అభీ బస్ గతంలో థమ్స్ అప్ వంటి బ్రాండ్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించాడు. అంతే కాకుండా మ్యాట్రిమోనీ వంటి సైట్‌లకు కూడా బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ కోట్లల్లో ఆర్జిస్తున్నాడు. తాజాగా మరో డీల్‌ని మహేష్ సొంతం చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రముఖ ఎంటర్ టైన్ మెంట్ ఛానల్ తో గతంలో రెండు కోట్ల డీల్ చేసుకుని ఓ భారీ ఈవెంట్ కు హాజరు కావడమే కాకుండా సదరు ఛానల్ లో ప్రసారం అయ్యే పలు క్రేజీ సీరియల్స్ కి కూడా ప్రచారకర్తగా వ్యవహరించారు. తాజాగా ఇదే ఎంటర్ టైన్ మెంట్ ఛానల్ కు ప్రచార కర్తగా మహేష్ మరోసారి సైన్ చేయడం విశేషం. ఇందుకు గానూ మహేష్ ఏకంగా రూ. 9 కోట్లు ఛార్జ్ చేస్తున్నారట. తాజా ఒప్పందం ప్రకారం మహేష్ సదరు టీవీ ఛానల్‌కు సంబంధించిన రియాలీటీ షోస్ టీవీ సీరియల్స్‌తో పాటు సంస్థ ప్రొడ్యూస్ చేసే పలు కార్యక్రమా లకు ప్రచారాన్ని కల్పించనున్నారని తెలుస్తోంది. ఈ డీల్ ఏడాది పాటు కొనసాగుతుందని తెలిసింది. ఇప్పటికే సదరు చానల్ కోసం తన ముద్దుల కూతురు సితార తో కలిసి ఓ డ్యాన్స్ షోలో మహేష్ పాల్గొనడం విశేషం. గత 15 ఏళ్లుగా మహేష్ కార్పొరేట్ బ్రాండ్ లకు ప్రచార కర్తగా వ్యవహరిస్తూ అత్యధిక పారితోషికం అందుకుంటున్న హీరోగా సరికొత్త రికార్డుని సొంతం చేసుకున్నాడు.



## మనవరాలు సితారతో కృష్ణ బుల్లితెర డ్యాన్స్

సూపర్ స్టార్ మహేశ్ బాబు బుల్లితెరపై సందడి చేయనున్నారు. ఓ ప్రముఖ డ్యాన్స్ షోకు కూతురు సితారతో కలిసి గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చారు. దీనికి సంబంధించిన ప్రోమో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఇందులో సితార తన డ్యాన్స్‌తో ఆకట్టుకుంది. సాధారణంగానే మహేశ్ షోలు, ఫంక్షన్లకు చాలా అరుదుగా వస్తుంటారు. అలాంటిది కూతురు సితారతో కలిసి తొలిసారిగా బుల్లితెరపై కనిపించనుండటంతో ఫ్యాన్స్ తెగ ఖుషీ అవుతున్నారు. వచ్చే ఆదివారం ఈ షో ప్రసారం కానుంది. కాగా ఇక సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం మహేశ్ బాబు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.




## రంగరంగవైభవంగాలో కేతికా శర్మ



రొమాంటిక్, లక్ష్య చిత్రాల తర్వాత 'రంగ రంగ వైభవంగా' చిత్రంతో వస్తోంది కేతికా శర్మ. వైష్టవ్ తేజ్ హీరోగా నటించిన ఈ సినిమా సెప్టెంబర్ 2న రిలీజవుతున్న సందర్భంగా ఇలా ముచ్చటించింది. 'నా పాత్ర పేరు 'రాధ'. ప్రేమ, నిజాయితీ గల అమ్మాయి. ఎమోషనల్‌గా ఉంటూనే ప్రాక్టికల్‌గానూ ఆలోచిస్తుంది. తన లైఫ్‌లో ప్రతి విషయాన్నీ బ్యాలెన్స్ చేస్తుంది. ప్రతి ఒక్కరూ ఇలాంటి కూతురు, ఫ్రెండ్, సిస్టర్ కావాలనుకుంటారు. నా పేరెంట్స్ డాక్టర్స్. నన్నూ డాక్టర్‌ని చేయాలనుకున్నారు. కానీ నేను యాక్టర్‌నయ్యాను. ఇందులో డాక్టర్‌గా నటించాను కనుక నాతో పాటు వాళ్లూ హ్యాపీ. వైష్ణవ్ నాకు మంచి ఫ్రెండ్ అయ్యాడు. తెరపై టామ్ అండ్ జెర్రీలా కనిపించడమే కాదు, సెట్‌లోనూ టీజ్ చేసుకుంటూ సరదాగా ఉండేవాళ్లం. తన వినయం, సింప్లిసిటీ అందరికీ నచ్చుతాయి. నరేష్, ప్రభు, తులసి, నవీన్ చంద్ర ఇలా చాలామంది నటించారు. ఒకేసారి ఇంతమందితో కలిసి ఎలా నటించాలనేది నేర్చుకున్నా. ఈ సినిమాతో కచ్చితంగా ఫ్యామిలీ ఆడియెన్స్‌కి దగ్గరవుతాననే నమ్మకముంది. సక్సెస్, ఫెయిల్యూర్స్ మన చేతిలో ఉండవు కనుక రిజల్ట్ గురించి పట్టించుకోను. నా పాత్ర విషయంలో హ్యాపీగా ఉన్నానా లేదా అనేదే చూస్తాను. రొమాంటిక్, లక్ష్య చిత్రాల్లో క్యారెక్టర్స్‌ని చాలా ఎంజాయ్ చేశాను. అందుకే రిగ్రెట్ అవలేదు. కథల ఎంపికలో సెలెక్టివ్‌గానే ఉంటాను. సోషల్ మీడియాలో నాపై వచ్చే కామెంట్స్‌ని కూడా ఎక్కువ చదవను. నా వర్క్ గురించి వచ్చే కన్‌స్టక్ట్రివ్ క్రిటిసిజమ్‌ని మాత్రమే తీసుకుంటాను. దానిపై వర్క్ చేస్తాను. నా కొత్త సినిమాల గురించి త్వరలోనే నిర్మాతల వైపు నుంచి అనౌన్స్‌మెంట్స్ వస్తాయి. ఎప్పటికైనా ఓ బయోపిక్‌లో నటించాలనేది కోరిక అంటూ వివరించింది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in